బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని రెయిన్‌బో విస్టాస్‌లో ఆదివారం హోలికా పూజ, హోలికా దహనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఉత్తరభారతీయులతో కలిసి హోలిక దహన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రంగోత్సవం ఉంటుందన్నారు. – మూసాపేట

హోలికా దహన్





కమ్యూనిటీ.. యూనిటీ రన్

బాలాజీనగర్ డివిజన్ రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్‌లో ఆదివారం 5కే రన్ నిర్వహించారు. డెకత్‌లాన్, సైబర్ సిటీ బిల్డర్స్ ఆధ్వర్యంలో గేటెడ్ కమ్యూనిటీ యూనిటీ (ఐక్యత) పేరుతో రన్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, సైబర్‌సిటీ వంశీకృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. సైబర్ సిటీ వాసులు ఎంతో ఉత్సాహంతో 5కే, 3కే రన్‌లలో పాల్గొన్నారు. – మూసాపేట

ఉత్తర నక్షత్ర జన్మదిన మహోత్సవం..

వివేకానందనగర్‌లోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఉత్తర నక్షత్ర జన్మదిన మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 25వ తేదీన ఉదయం 4.30గంటలకు లక్ష్మీగణపతి హోమం, 8 నుంచి 12గంటల వరకు పదకొండు సార్లు 11 విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు భగవతి సేవ, 7.30గంటలకు పడిపూజ, భజన, హరివరాసనం తీర్థ ప్రసాద వితరణ, అల్పాహారం నిర్వహిస్తారు. – ఆల్విన్‌కాలనీ



ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సాక్షి,సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని విజయనగర్‌కాలనీ పటేల్‌కుంట పార్క్ వద్ద ఉన్న శ్రీవిజయ సీనియర్ సిటిజన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమోర్ ఆస్పత్రి వైద్యులు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల ఆయుర్వేద, హోమియో, ఆక్యుపంచ్చర్ శిబిరాలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులులు పడిగేశ్వరరావు, రామచంద్రరావు, వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యాలయం పరిసరాల్లో ఉండే ప్రజలు ఉచిత సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు

బాలానగర్: ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని లయన్స్ క్లబ్ బాలానగర్ అధ్యక్షుడు డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం బాలానగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్, ఎస్ఎస్‌కే సమాజం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు మనం కృషి చేయాలన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దీపక్ భట్టాచార్య, రాజేంద్రప్రసాద్, విష్ణు, శ్రీరామ్, రాజశేఖర్, దీపారాణి, పాండురంగం, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రంగుల సందడి

మూసాపేట్: హోలీ పండుగ నేపథ్యంలో ప్రధాన మార్కెట్లలో వివిధ వర్ణాల రంగులు, హోలీ ఆడే పిచికారిలు, చిలకల పీర్లు, కొబ్బరి కుడకల దండలు ఆకర్షణగా నిలిచాయి. వివేకానంద కమాన్ వద్ద, సుమిత్రనగర్‌లోని కనకదుర్గ ఆలయం వద్ద, కూకట్‌పల్లిలోని మీ–సేవ ఎదురుగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో రంగుల విక్రయాలు కొనసాగాయి. చిన్నారులను ఆకర్షించే విధంగా వివిధ ఆకృతుల్లో ఉన్న పిచికారిలు రూ.100 మొదలుకుని రూ.200 వరకు ధర పలికాయి. అదే విధంగా హోలీ నాడు చిన్నారులకు ధరింపజేసి చిలకల పీర్లు, కొబ్బరి కుడకల దండలను ప్రజలు కొనుగోలు చేశారు. ఈ దఫా కొద్దిగా అమ్మకాలు మందగించాయని విక్రయదారులు పేర్కొంటున్నారు. అయితే సహజసిద్ధమైన రంగులతో హోలీ ఆడాలని అధికారుల సూచించినా రసాయన రంగులే ఎక్కువగా ప్రధాన మార్కెట్లలో కనిపించాయి.











ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ బీజేపీలోకి ఊపందుకున్న వలసలు



భగవంత్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్, మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా బీజేపీ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో ఇతర పార్టీ నుంచి పెద్ద ఎత్తున బీజేపీలోకి వలసలు ఊపందుకున్నాయి. ఈ సందర్భంగా కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో అసెంబ్లీ కార్యాలయంలో ఆదివారం ఫతేనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భగవంత్‌రెడ్డి, ఆయన అనుచరులతో ఈటల రాజేందర్ చేతుల మీదుగా బీజేపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ అనంతరం ఏర్పాటు చేసిన బూత్ సమావేశంలో మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. ఈసారి మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. ఇంటింటికీ గడపగడపకు అందుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి దేశానికి మరోసారి మోదీ నాయకత్వ అవసరాన్ని వివరించాలని ఆయన బూత్ అధ్యక్షులకు సూచించారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రదీప్‌రావు, కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్ కుమార్ గౌడ్ర, నాయకులు సురేందర్, సోమశేఖర్, వినోద్, రాము, అనిల్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రతిబింబ్..



ఆల్విన్‌కాలనీ: ఎస్ఎస్‌డీ గ్రామర్ హైస్కూల్, ఎస్ఎస్‌డీ కిడ్స్ అండ్ క్రేయాన్స్ సీబీఎస్‌సీ పాఠశాలలో ఆదివారం ప్రతిబింబ్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పాఠశాల నిర్వాహకులు సురభి రవీందర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి స్కిట్స్ ఎక్సీడ్ ఇంగ్లీష్ కాన్సెప్ట్, డాన్స్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొన్నారు. స్టేజ్ ఫియర్, బాడీ లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్ వారి సబ్జెక్టుల్లో నుంచి టాపిక్స్ తీసుకొని స్పీకింగ్ అండ్ డాన్స్ జోడించి వినూత్న ప్రదర్శనలు ఇచ్చారు. వాటర్ సైకిల్‌పైవ్ ఎలిమెంట్స్, ఎలక్ట్రో మాగ్నటిజం, జంక్‌ఫుడ్ వర్సెస్ హెల్తీ ఫుడ్, మాక్ పార్లమెంట్ వంటి థీమ్స్‌ను ప్రదర్శించారు.

కాంగ్రెస్ పేరుతో అక్రమాలకు పాల్పడితే

చర్యలు తీసుకుంటాం

అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరని పార్టీ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ మొయినుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకొని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్‌పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు మాట్లాడుతూ... అక్రమ నిర్మాణాలు అనధికారికంగా నిర్వహించే.. వాటర్ ప్లాంట్‌లు, చెరువులలో నుంచి అక్రమంగా పైపులు వేసి నీటి వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డివిజన్‌లోని మైసమ్మ, సున్నం, కాముని చెరువు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదే విధంగా చెరువుల నుంచి అక్రమంగా చేపడుతున్న నీటి వ్యాపారాన్ని అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి. సుంకన్న, ఎస్. నరసింహ యాదవ్, పి. విఠల్‌రెడ్డి, నెల్లి శ్రీనివాసరెడ్డి, పల్లపు వేణు, కనకయ్య ముదిరాజ్, ఆదిరెడ్డి, ఎస్‌కే. జావిద్ ఆలీ, అబ్దుల్లా, ఎండీ కమ్మర్, పొన్నాల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్యకర్తలకు పెద్దపీట

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితో బండి రమేష్

బాలానగర్: కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త, నాయకుడికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం, గౌరవం ఉంటాయని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఇతర పార్టీల నుంచి వచ్చిన కార్యకర్తలను సైతం కలుపుకొని పార్టీ పటిష్టానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కేపీహెచ్‌బీకాలనీకి చెందిన మహిళా నాయకురాలు నాగమణి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన గంగా శివకుమారి, పుష్పారాణి, సంధ్య వారి అనుచరులు 30 మంది మహిళలు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తామన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సీట్‌ను మొదటిసారిగా ఓ మహిళకు కేటాయించటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ–బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ప్రతాప్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, పుష్పరెడ్డి, కరికే పెంటయ్య, రాజేందర్, శివచౌదరి, అరుణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లకు మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

మూసాపేట: హోలీ పండగ నేపథ్యంలో మూసాపేటలో బెల్ట్‌షాప్‌లకు మద్యం తరలిస్తున్న వ్యక్తులను కూకట్‌పల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హోలీ పండుగ సందర్భంగా ప్రభుత్వం రెండు రోజుల పాటు వైన్‌షాపులు మూసివేయాలన్న నిబంధనతో బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్న వారిని అరెస్టు చేశారు. మూసాపేట కైత్లాపూర్‌లో చెన్నూరు లక్ష్మయ్య (45) కిరాణా షాపు నిర్వహిస్తుంటాడు. 90 ఎంఎల్ మద్యం 96 బాటిల్స్ మద్యాన్ని పట్టుకున్నారు. మరో వ్యక్తి నవీన్ (27) కైత్లాపూర్‌కు 10 లీటర్ల 90 ఎంఎల్ మద్యం బాటిల్స్ తీసుకొని వెళుతుండగా రాఘవేంద్ర సొసైటీ వద్ద పట్టుకున్నారు. మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

భాగ్యనగర్‌కాలనీ: ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో సదరు మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదయ్యింది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన వాసిరెడ్డి నరేందర్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నాడు ఆన్‌లైన్ క్లాసులు ఉన్నాయని మహిలను తన ఆఫీసుకి పిలిపించుకొని ఆమెను లోబరుచుకున్నాడు. అదే ఇన్‌స్టిట్యూట్‌లో ఆన్‌లైన్ క్లాసులకు వచ్చిన మరో వ్యక్తి సంతోష్‌తో ఆమెకు జరిగిన విషయాన్ని పేర్కొంది. దీంతో సంతోష్ ఆమెతో చనువుగా ఉండి లొంగదీసుకునేందుకు యత్నించాడు. దీంతో ఆమె ఇటీవల ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు.



శ్రీసాయి తపస్య డే-కేర్ స్కూల్ వార్షికోత్సవంలో చిన్నారులు



ఘనంగా పాఠశాలల వార్షికోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: పటేల్‌కుంట పార్కు సమీపంలోని శుభోదయకాలనీలోని శ్రీసాయి తపస్య డే కేర్ స్కూల్ మొదటి వార్షికోత్సవం ఆదివారం కూకట్‌పల్లిలోని ఏటీసీ హోటల్‌లో ఘనంగా జరిగింది. స్కూల్ కరస్పాండెంట్ కోడూరి మాధవి సురేష్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు అభినయించిన సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల తల్లిదండ్రులు తిలకించారు. ప్లే స్కూల్ విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో పాటు, రామాయణంలోని రాముడు, సీత వంటి ఏకపాత్రాభినయం చూపరులను అలరించింది.

ఘనంగా మెగా స్కూల్ వార్షికోత్సవ వేడుకలు..

మోతీనగర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని మహిళా చిల్డ్రన్స్ పార్కు ఆవరణలో మెగా స్కూల్ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరికి ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం. రఘువీర్‌నాథ్ రావు, ప్రిన్సిపల్ సుచిత్ర పాటిల్, స్థానిక నాయకులు తిమ్మారెడ్డి వీరారెడ్డి, లింగాల ఐలయ్య,పెసర సంజీవరెడ్డి, జ్ఞానేశ్వర్, మాధవాచారి, సంజీవ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



మెగా స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ సబిహా బేగం

నేడు కూరగాయల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్ బాలాజీ స్వర్ణపురికాలనీలో ప్రతి సోమవారం కూరగాయల సంత నిర్వహిస్తారు. తాజా కూరగాయలు, పండ్లు, పూలు, నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు అందుబాటులో ఉంటాయి. అదే విధంగా శ్రీవివేకానందనగర్‌లో కూడా ఈ సంత కొనసాగుతుంది.